

**79**
**ధారావాహిక**

**జరిగిన కథ :**

కాకతి..
అటు అయ్యనవోలు వెళ్లలేదు.
ఇక్కడ రేణుక ఇంటికీ చేరలేదు.
ఆమెకోసం వెతకసాగాడు జాయపుడు.
కానీ, ఆమె వార్త తెలియరాలేదు.
కాకతీయ వేగులు, సైనికులు ఆమెకోసం
వెతకని చోటులేదు. తిరగని ఊరులేదు.
కాకతి కనిపించక పోవడంతో జాయపుడు
దాదాపు పిచ్చివాడయ్యాడు.
తిండితిప్పలు మాని.. మధుపాన మత్తుడయ్యాడు.
అలా.. ఓ మహాయోధుడు జీవితమనే
మహా యుద్ధరంగంలో తొలి ప్రవేశంలోనే
ఓడిపోయి మూలన
ముడుచుకుపోయాడు!!

# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి ...
99893 71284

**చారిత్రక కాల్పనిక నవల**

అప్పుడే కాకతీయసైన్యం యుద్ధభేరి మోగించింది.

గతంలో ఎరువ భీముడు, రాజనాయకుడు, జాయపసేనాని రెండేళ్లపాటు నిర్వహించిన ఉత్తర, ఈశాన్య రాజ్యాల దండయాత్రకు కొనసాగింపుగా.. ఇప్పుడు కాకతీయ సామ్రాజ్య విస్తరణలో భాగంగా కొలని రాజ్యంపై యుద్ధం ప్రకటించాడు కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడు. ఎన్నో ఆలోచనలతో ఎంతో చర్చించి తీసుకున్న నిర్ణయాలను, ప్రణాళికలను ఎవరికో సమో వాయిదావేసే చక్రవర్తి కాదాయన.

యుద్ధం నిర్ణయించారు. అది ప్రారంభమై తీరాలి. ప్రారంభమైంది. రెండు నెలలు కావస్తున్నది. కొలని పురి సైన్యం చాలా గట్టి ప్రతిఘటన ఇస్తూ.. కాకతీయులకు కొరుకుడు పడటంలేదు. యుద్ధ తంత్రజ్ఞులంతా చింతాక్రాంతులయ్యారు. కాకతీయ యుద్ధశైలి కనిపించడం లేదు. ఏదో లోపం కనిపిస్తున్నది.

ఏదో చెయ్యాలి. ఎలా??

ఈ సమయంలో మల్యాల చౌండ చటుక్కున ఉచ్చరించిన పదం.. 'జాయపుడు!'.

అందరూ ఉలిక్కిపడి చూశారు.

''ఈ సమయంలో ఉండవలసినవాడు.. యుద్ధగతిని మార్చగలిగినవాడు జాయపసేనాని మాత్రమే! గజసైన్యాన్ని అత్యద్భుతంగా యుద్ధసన్నద్ధం చేసి తను మూలనపడిపోయాడు. అతను లేచి పోరాడితేనే గెలుపు!''.

అందరూ చక్రవర్తి వంక చూశారు.

ఆయన తల దించుకున్నాడు.

''ప్చ్..'' అన్నాడు నిస్పృహగా.

అటు యుద్ధం పరాజయ బాట పడుతున్నది. ఇటు ఎంతో ప్రయోజకుడై కాకతీయ సామ్రాజ్యాన్ని మరోస్థాయికి తీసుకు వెళ్లాడనుకున్న జాయపుడు కొరగాని వాడై జీవచ్ఛవంలా పడి ఉన్నాడు. ఎలా? ఎలా అతణ్ని మళ్లీ మనిషిని చెయ్యడం?

అప్పుడొచ్చిందో ఆలోచన!!

జాయపునికి అత్యంత ఇష్టమైనది ఏది? నాట్యం! నాట్యంతోనే ఆ పిల్ల పరిచయమట. ఇదే బలహీనత మీద దెబ్బకొట్టాలి. మరునాడు బృందనాయకుడు కొండయ.. జాయపుణ్ని పురనివాసంలో కలిశాడు.

మధువు మత్తులో కళ్లుమూసుకుని ఓమూల పడి ఉన్నాడు జాయపుడు.

భైరవ ఆత్మాహుతి తర్వాత గ్రామంలో పరిస్థితిని వివరించాడు. కాకతి కనిపించకపోవడం అందరినీ దిగ్భ్రమకు గురిచేసింది కానీ.. అందుకు కారణం జాయపుడేనని ఎవ్వరూ అనడం లేదని చెప్పాడు.

''కాకతి మాయమైన ఆ సిద్ధేశ్వరాలయం వద్దే మనం నాట్య ప్రదర్శన చెయ్యాలి. ఆమె తప్పకుండా తిరిగివస్తుంది దేవరా..'' చెవిలో నమ్మబలుకుతున్నాడు కొండయ.

''అక్కడే అదృశ్యమైంది.. అక్కడే ప్రత్యక్షమౌతుంది!''.

అతని చెవివద్ద అదే మంత్రం. మళ్లీ మళ్లీ..

సంధ్యవేళకు జాయపుడు నమ్మాడు. కళ్లు తెరిచాడు. లేచి నిలబడ్డాడు. మధు చషకాన్ని విసిరికొట్టాడు.

''నాట్య ప్రదర్శనకు నేను సిద్ధం!''.

మరునాడే నాట్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. సిద్ధేశ్వరాలయం వద్ద తాండవ నృత్తానికి సిద్ధమయ్యాడు జాయపుడు. పక్కన ఉమగా కాకతివచ్చి నాట్యం చెయ్యాలి. వస్తుంది. కాకతి ఇక్కడే అదృశ్యమయ్యింది. ఇక్కడే ప్రత్యక్షం అవుతుంది! తప్పక అవుతుంది!!

అలౌకిక ధ్యానసమాధిలో ఉన్నాడు జాయపుడు. చుట్టూ జనం లేరు. ఉన్నది ఆ దేవదేవుడు సిద్ధేశ్వరుడు. ఆయనే నాట్యానికి ఉమాదేవిగా కాకతిని ముస్తాబు చేసి పంపిస్తాడు!!

ఆహార్యం ధరించి గజ్జెలు కాళ్లకు కట్టుకుంటూ.. ఒక్కసారి గగుర్పాటుకు గురయ్యాడు జాయపుడు. శరీరమంతా కంపించింది. అతను ఎప్పుడు తాండవ నృత్తానికి సిద్ధమైనా ఇదే గగుర్పాటు. శారీరక కంపన వస్తుంది.

వస్తుంది.. తప్పక వస్తుంది! కాకతి వస్తుంది!!

నమ్మకం ఘడియ ఘడియకు పెరుగుతున్నది.

నట్టువాంగం తాళాలు చేతికి తీసుకున్నాడు కొండయ.